News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :143 | ఖమ్మం | గురువారం, జూలై 2, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## హైదరాబాద్ మణికొండలో ఈగల్ టీమ్ ఆకస్మిక దాడులు

హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మణికొండలో మాదకద్రవ్యాల నిరోధక విభాగానికి చెందిన 'ఈగల్ టీమ్' బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో భాగంగా ఓ ప్రైవేట్ హోటల్‌లో బస చేసిన వ్యక్తిని హ్యాష్ ఆయిల్ (లిక్విడ్ గాంజా) విక్రయిస్తుండగా అధికారులు రెడ్ వివరాలు 2లో..

# కవిత పార్టీ పేరుపై అభ్యంతరాల వెల్లువ..

కవిత కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పేరుపై అభ్యంతరం
కేంద్ర ఎన్నికల సంఘానికి దాదాపు 700 అభ్యంతరాలు
ఫిర్యాదు చేసిన వారిలో అత్యధికం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలే
అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్న ఈసీ




కల్వకుంట్ల కవిత స్థాపించిన నూతన రాజకీయ పార్టీ పేరుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఆమె ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పేరుపై కేంద్ర 2లో

# పాలనపై చర్చకు సిద్ధం.. తేదీ చెప్పండి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్


కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటన

తేదీ, సమయం ఖరారు చేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేసిన కేటీఆర్




## బండి భగీరథ్ పోక్సో కేసు..

- బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ
- బాధితురాలి వాదన వినేందుకు ఆమెకు నోటీసులు జారీ
- కేసు విచారణను ఎల్లుండికి వాయిదా వేసిన హైకోర్టు




# ఆర్మీ కొత్త చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతలు..

భారత సైన్యం 31వ అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు.

- జనరల్ ఉపేంద్ర ద్వివేది నుంచి ధీరజ్ సేథ్ బాధ్యతల స్వీకరణ
- 'విజయ్' నినాదంతో తన ప్రాధాన్యతలను ప్రకటించిన కొత్త చీఫ్
- నిఘా, ఆవిష్కరణలు, ఆత్మనిర్భరత, యోధుల సంక్షేమమే లక్ష్యమని వెల్లడి
- దేశ రక్షణకు సైన్యం ఎల్లప్పుడూ సిద్ధమని హామీ

# అక్రమ వలసలు, జనాభా మార్పులపై కేంద్రం ఫోకస్..




మతపరమైన మార్పులు, ఇతర అసాధారణ కారణాల వల్ల చోటుచేసుకుంటున్న జనాభా మార్పులను అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ త్వరలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పర్యటించనుంది. జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవ్లేకర్ నేతృత్వంలోని ఈ కమిటీ క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించి, మిగతా2లో




## ఓర్చుకోలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారు

-తెలంగాణలో రాముడి ఆదర్శ పాలన సాగుతోందన్న మల్లు రవి

-అయోధ్య రాముడి సొమ్మును బీజేపీ దిగమింగిందని ఆరోపణ

-రాహుల్ ప్రధాని కావడం ఖాయమని ధీమా




## ప్రభుత్వ ఆస్పత్రుల్లో పీపీపీ మోడల్

### ఉచిత టెస్టులకు సరికొత్త ప్రణాళిక

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య పరికరాల నిర్వహణ సమస్యలకు పరిష్కారంగా తెలంగాణ ప్రభుత్వం పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ మోడల్‌ను పరిశీలిస్తోంది. ఈ విధానంలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్‌రే, రక్తపరీక్షల వంటి డయాగ్నస్టిక్ సేవలను ప్రైవేట్ సంస్థలు నిర్వహించగా, రోగులకు పరీక్షలు ఉచితంగా అందించి ఖర్చును ప్రభుత్వం భరించే అవకాశాన్ని పరిశీలిస్తోంది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన నిర్ధారణ సేవలు నిరంతరాయంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వివరాలు 2లో..

## హైటెక్ డ్రోన్ పోలీసింగ్..



మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పోలీసులు హైటెక్ డ్రోన్ పోలీసింగ్‌ను మరింత విస్తృతంగా అమలు చేస్తున్నారు. ముఖ్యంగా సరూర్‌నగర్ చెరువు పరిసర ప్రాంతాల్లో డ్రోన్ల సహాయంతో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశారు. గంజాయి వివరాలు 2లో..




# సింధు జలాల వివాదం

ఏకపక్ష చర్యలు వద్దంటూ భారత్‌కు పాక్ హెచ్చరిక

పాకిస్థాన్‌కు సింధు నది జీవనాధారం అన్న బిలావల్ భుట్టో

ఏకపక్షంగా ఒప్పందాన్ని రద్దు చేయలేరన్న పాక్ ఉప ప్రధాని

2025 పహల్గామ్ దాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్

సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని పాకిస్థాన్ భారత్‌ను హెచ్చరించింది.




## ఆదాయ సమీకరణపై సీరియస్‌గా ఫోకస్ పెట్టండి..

# ట్రాఫిక్ సిగ్నల్స్.. హైదరాబాద్‌కు సరికొత్త టెక్నాలజీ..



నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే అనలాగ్ వ్యవస్థాపకుడు అలెక్స్ కిప్‌మాన్, MEIL ఎండీ పి. కృష్ణారెడ్డిలతో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఒప్పందం కుదుర్చుకున్నారు హైదరాబాద్‌ను అత్యాధునిక స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి వివరాలు 2లో..



# నేడే క్యాబినెట్ భేటీ...

## చరిత్ర సృష్టించనున్న సీఎం రేవంత్ రెడ్డి!

వీటిపై కీలక నిర్ణయాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ తొలి కాగిత రహిత (ఈ-క్యాబినెట్) సమావేశం జులై 2న జరిగింది. డిజిటల్ పాలన దిశగా ఈ సమావేశం ఒక ముఖ్య వివరాలు 2లో..

## ఆర్మీ కొత్త చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతలు

భారత సైన్యం 31వ అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పదవీ విరమణ చేసిన జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో ఆయన ఈ బాధ్యతలను స్వీకరించారు. ఈ నియామకం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేస్తూ.. విధి, గౌరవం, దేశమే ప్రథమం అనే ఆదర్శాలకు కట్టుబడి సైన్యాన్ని నడిపిస్తానని స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జాతీయ యుద్ధ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం సౌత్ బ్లాక్‌లో గౌరవ వందనం స్వీకరిం చారు. ఈ సందర్భంగా తన తండ్రి, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కేఎం సేథ్‌కు ఆయన సెల్యూట్ చేయడం, ఆయన సోదరుడు రియర్ అడ్మిరల్ రవ్నీశ్ సేథ్ ఆయనకు సెల్యూట్ చేయడం ప్రత్యేకంగా నిలిచింది. ఈ సందర్భంగా జనరల్ సేథ్ మాట్లాడుతూ.. 'విజయ్' అనే నినాదంతో తన ప్రాధాన్యతలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. సరిహద్దుల్లో నిరంతర నిఘా , వినూత్న ఆవిష్కరణలు ,వైమానిక-నౌకాదళాలతో సమన్వయం , ఆత్మనిర్భరత, సైనికుల సంక్షేమా నికి అగ్ర ప్రాధాన్యం అనే ఐదు అంశాలే తన లక్ష్యాలని వివరించారు. భారత సైన్యానికి నాయకత్వం వహించే గౌరవం, బాధ్యతను అప్పగించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు సైన్యం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని దేశ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ సాయుధ బలగాల కోసం ఇచ్చిన 'జై' మంత్రమే తన 'విజయ్' ప్రాధాన్యతలకు పునాది అని, ఇది తమను విజయం వైపు నడిపిస్తుందని జనరల్ సేథ్ పేర్కొన్నారు.

## ఆదాయ సమీకరణపై సీరియస్‌గా ఫోకస్ పెట్టండి

బుధవారం ఎమ్‌సీఆర్ హెచ్‌ఆర్‌డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఛేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నా రు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీ గా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగు పరుచుకోవాలని సీఎం సూచించారు. AI టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను డీబీటీ కి అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు. పెండిం గ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా బడ్జెట్‌ను తయారు చేసుకో వాలన్నారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు. ఊహాజనిత బడ్జెట్ కాదని.. వాస్త వికత ఆధారంగానే బడ్జెట్‌ను రూపొందించు కోవాలని అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమా వేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రు లు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఓర్చుకోలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారు

రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సర్వజన సంక్షేమమే ధ్యేయంగా దూసుకుపోతుంటే, ఓర్వలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నా రని మండిపడ్డారు. తెలంగాణలో ఉనికి కోసం ఆరాట పడుతున్న బీజేపీ... దేశంలో అత్యంత అవినీతి, నియంతృత్వ ధోరణులతో ఒక 'రావణాసుర పాలన' సాగిస్తోందని మల్లు రవి ధ్వజమెత్తారు. ఇటీవల తెలం గాణలో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటన ఒక 'అట్టర్ ఫ్లాప్ షో' అని ఎద్దేవా చేశారు. ఇక్కడ కాంగ్రెస్‌ను గద్దె దించడం ఎవరి వల్లా కాదని, తెలంగాణ సమాజం మత విద్వేష రాజకీయా లను ఎన్నటికీ ఆదరించదని స్పష్టం చేశారు. అయోధ్య రాముడి పేరుతో 40 ఏళ్లుగా రాజకీయం చేస్తున్న బీజేపీ... చివరకు ఆ దేవుడి సొమ్మును కూడా వదలకుండా మింగేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. స్వయంగా యూపీలోని అయోధ్య వాసులే ఆ పార్టీ అవినీతిపై ఆగ్రహంతో ఉన్నారని, దేశంలో కమలం పార్టీకి కాలం చెల్లిందన్నారు. విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీకి రాబోయే సార్వత్రిక ఎన్నికలే చివరివని, త్వరలోనే దేశం 'బీజేపీ ముక్త్ భారత్' కాబోతుందని జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీయడం, రాహుల్ గాంధీ ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఖాయమని మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు.

## బండి భగీరథ్ పోక్సో కేసు..

పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తనపై నమోదు చేసిన కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, ఎలాంటి తప్పూ చేయలేదని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని భగీరథ్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. అయితే బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే ముందు బాధితురాలి వాదన కూడా వినాల్సి ఉందని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని బాధితురాలికి నోటీసులు జారీ చేసింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది. మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో బండి భగీరథ్‌పై మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. అనంతరం పరారైన అతణ్ని మే 16న పోలీసులు అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు. ఇంజినీరింగ్ పరీక్షలు రాసేందుకు వీలుగా ఈ నెల 20 నుంచి 24 వరకు మధ్యంతర బెయిల్ మంజూరైంది. గడువు ముగియడంతో గత వారం మళ్లీ చర్లపల్లి జైలుకు తరలించారు.

## హైదరాబాద్ మణికొండలో ఈగల్ టీమ్ ఆకస్మిక దాడులు

తమకు అందిన సమాచారం మేరకు మణికొండ పరిధిలోని సదరు ప్రైవేట్ హోటల్‌పై ఈగల్ టీమ్ సభ్యులు ఒక్కసారిగా మెరుపు దాడులు చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. నిందితుడి నుంచి 9 గ్రాముల లిక్విడ్ హ్యాష్ ఆయిల్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితుడితో పాటు సీజ్ చేసిన హ్యాష్ ఆయిల్‌ను స్థానిక నార్సింగి పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ వ్యక్తి డ్రగ్స్ విక్రేతా? లేక ఏజెంటా? అనే కోణంలో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ హ్యాష్ ఆయిల్ ఎక్కడి నుంచి నగరానికి తీసుకొచ్చారు? దీని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు? ఐటీ కారిడార్‌లోని ఎవరెవరికి దీనిని సరఫరా చేస్తున్నారు? అనే అంశాలపై నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు. నగరంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిఘా మరింత కఠినతరం చేసినట్లు అధికారులు తెలిపారు.

# ట్రాఫిక్ సిగ్నల్స్.. హైదరాబాద్‌కు సరికొత్త టెక్నాలజీ..

పెవిలియన్‌లో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ పి. కృష్ణారెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమై భవిష్యత్ మౌలిక సదుపా యాలు, సాంకేతిక పరిష్కారాలపై చర్చించారు. నగరంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్తంగా చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిని సంస్థల ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నెక్స్ట్ జనరేషన్ ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కా రాలపై తమ ప్రణాళికలను వివరించారు. హైదరా బాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను కూడా సమావేశంలో ప్రదర్శించారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా సేవలు, పట్టణ పాలనను మరింత సమర్థవంతంగా మార్చేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగి ంచవచ్చో వివరించారు. సెన్సర్లు, రోబోటిక్స్, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాంల వినియోగంతో ట్రాఫిక్ రద్దీని ముందు గానే గుర్తించడం, సిగ్నళ్లను ఆటోమేటిక్‌గా నియంత్రించడం, నీటి లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టడం, విద్యుత్ వినియో గాన్ని అవసరానికి అనుగుణంగా నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు వేగంగా మార్గం కల్పించడం వంటి కాగ్నిటివ్ సిటీ పరిష్కారాలను సంస్థలు వివరించాయి. వేగంగా విస్తరిస్తున్న నగరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళిక, ప్రభుత్వ సేవల సామర్థ్యాన్ని పెంచడం, పౌరులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని సంస్థలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ నగరం లోని అన్ని ట్రాఫిక్ సిగ్నళ్లను ఒకే వ్యవస్థలో అనుసం ధానం చేయాలని, ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్న ళ్లు స్వయంచాలకంగా పనిచేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అలాగే వాతావరణ పరిస్థితు లను కూడా పరిగణనలోకి తీసుకుని ట్రాఫిక్ నిర్వహ ణను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు సమావేశం అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపా యాల అభివృద్ధిని వేగవంతం చేయడంలో ఈ భాగస్వామ్యం కీలకంగా మారనుందని ప్రభుత్వం తెలిపింది

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో పీపీపీ మోడల్.. ఉచిత టెస్టులకు సరికొత్త ప్రణాళిక

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య పరికరాల నిర్వహణ సమస్యలకు పరిష్కారంగా తెలంగాణ ప్రభుత్వం పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ మోడల్‌ను పరిశీలిస్తోంది. ఈ విధానంలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్‌రే, రక్తపరీక్షల వంటి డయాగ్నస్టిక్ సేవలను ప్రైవేట్ సంస్థలు నిర్వహించగా, రోగులకు పరీక్షలు ఉచితంగా అందించి ఖర్చును ప్రభుత్వం భరించే అవకాశాన్ని పరిశీలిస్తోంది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రు ల్లోనే నాణ్యమైన నిర్ధారణ సేవలు నిరంతరాయంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారు లు భావిస్తున్నారు. హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య పరికరాల కొనుగోలు, నిర్వహణలో వస్తున్న ఇబ్బందులను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానాన్ని పరిశీలిస్తోంది. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ మోడల్ ద్వారా సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్‌రే, రక్తపరీక్షల వంటి డయాగ్న స్టిక్ సేవలను అందుబాటులోకి తీసుకురావా లనే ప్రతిపాదనపై కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులకు అవస రమైన వైద్య పరికరాలను టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. గ్యారంటీ కాలం ముగిసిన తర్వాత నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల అనేక యంత్రాలు పనికిరాకుండా పోతున్నాయి. దీంతో రోగులు ప్రైవేటు డయాగ్నస్టిక్ కేంద్రాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడు తోంది ప్రతిపాదిత పీపీపీ విధానంలో యంత్రాలను ప్రైవేట్ సంస్థలే ఏర్పాటు చేస్తాయి. వాటి నిర్వహణ, విడిభాగా ల మార్పు, అవసరమైన రియాజెంట్లు, ఇతర వినియో గ వస్తువులన్నింటినీ అదే సంస్థలు చూసుకుంటాయి. ప్రభుత్వం ఆస్పత్రిలో అవసరమైన స్థలం, విద్యుత్ వంటి మౌలిక సదుపా యాలు మాత్రమే కల్పిస్తుంది. ప్రభుత్వ వైద్యుడు సూచించిన పరీక్షలను రోగులు అదే ఆస్పత్రిలో చేయించుకోవచ్చు. పరీక్షలకు రోగుల నుంచి డబ్బు వసూలు చేయకుండా, ఆయా పరీక్షల ఖర్చును ప్రభుత్వం నేరుగా నిర్వహణ సంస్థలకు చెల్లించే విధానాన్ని అమలు చేసే అవకాశాన్ని పరిశీలి స్తోంది. ఈ విధానం అమలైతే యంత్రాలు చెడిపో వడం వల్ల సేవలు నిలిచిపోవడం, రోగులను బయట ప్రైవేట్ కేంద్రాలకు పంపించడం వంటి సమస్యలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని వైద్య వర్గాలు భావిస్తున్నాయి. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన నిర్ధారణ సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు ఇప్పటికే ఇలాంటి పీపీపీ విధానాన్ని అమలు చేస్తున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఈ మోడల్ ద్వారా డయాగ్నస్టిక్ సేవలు అందిస్తున్నారు. కొన్ని చోట్ల స్వల్ప యూజర్ ఛార్జీలు ఉండగా, పేద కుటుంబాలకు ప్రత్యేక కార్డుల ద్వారా ఆ భారం కూడా ప్రభుత్వాలే భరిస్తున్నాయి.

# నేడే క్యాబినెట్ భేటీ.. చరిత్ర సృష్టించనున్న సీఎం రేవంత్ రెడ్డి!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ తొలి కాగిత రహిత (ఈ-క్యాబినెట్) సమావేశం జులై 2న జరిగింది. డిజిటల్ పాలన దిశగా ఈ సమావేశం ఒక ముఖ్య అడుగు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, వీబీ-గ్రామ్ పథకం అమలు, వానాకాలం సాగు ప్రణాళికలు, ఉద్యోగుల బదిలీలు, సిగ్ హౌసింగ్ ప్రాజెక్టుపై క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం (జులై 2) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో తొలి కాగిత రహిత (ఈ-క్యాబినెట్) సమావేశంగా దీనిని నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గత మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఇకపై క్యాబినెట్ సమావేశాలను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి సహా మంత్రులందరికీ ట్యాబ్‌లు అందజేశారు. ఇటీవల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజుకు కూడా ఇదే తొలి మంత్రివర్గ సమావేశం కానుంది. ఈ సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు సంబంధించిన తాజా పరిణామాలు, తదుపరి కార్యాచరణపై చర్చ జరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం, ప్రాజెక్టు పురోగతిపై మంత్రివర్గం కీలకంగా సమీక్షించే అవకాశం ఉందని సమాచారం. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా కేంద్రం తీసుకొచ్చిన వీబీ జీ-రామ్ పథకాన్ని తెలంగాణలో అమలు చేయాలా లేదా అనే అంశం పైనా మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ పథకంలోని కొన్ని నిబంధనలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ చర్చకు ప్రాధాన్యం ఏర్పడింది. వానాకాలం సాగు, విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల వైవిధ్యం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే చర్యలపై కూడా మంత్రివర్గం చర్చించనుంది. ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహకాలు కల్పించాలన్న వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రతిపాదనలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య స్థానికత ఉన్న ఉద్యోగుల పరస్పర అంతర్రాష్ట్ర బదిలీలపై కూడా మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో పాటు హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలో ప్రతిపాదిత ఎస్ఐజీ హౌసింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన స్థలాలు, డిజైన్లు, విధివిధానాలకు కూడా ఆమోదం తెలిపే అవకాశముందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. డిజిటల్ పాలన దిశగా ప్రభుత్వం వేస్తున్న మరో అడుగుగా భావిస్తున్న ఈ తొలి ఈ-క్యాబినెట్ సమావేశంలో పలు కీలక విధాన నిర్ణయాలు వెలువడే అవకాశంపై రాజకీయ, పరిపాలనా వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# అక్రమ వలసలు, జనాభా మార్పులపై కేంద్రం ఫోకస్.. అమిత్ షా కీలక ఆదేశాలు

మతపరమైన మార్పులు, ఇతర అసాధారణ కారణాల వల్ల చోటుచేసుకుంటున్న జనాభా మార్పులను అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ త్వరలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పర్యటించనుంది. జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవ్లేకర్ నేతృత్వంలోని ఈ కమిటీ క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించి, జనాభా మార్పుల కారణాలను విశ్లేషించనుంది. కమిటీ వ్యూహాలు, కార్యాచరణపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమావేశమై చర్చించింది. దేశంలో అక్రమ వలసలు, అసాధారణ కారణాల వల్ల సంభవిస్తున్న జనాభా మార్పుల పై క్షేత్ర స్థాయి అధ్యయనం చేయడానికి ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ త్వరలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పర్యటించనుంది. ఈ మేరకు ఈ అత్యున్నత స్థాయి కమిటీ చైర్మన్ జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవ్లేకర్ (రిటైర్డ్) నేతృత్వంలోని బృందం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి తమ వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణపై వివరాలను అమిత్ షాకు తెలియజేసింది. రాష్ట్ర ఈ కమిటి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలనా యంత్రాంగాల నుంచి క్షేత్రస్థాయి వివరాలు, జనాభా మార్పులకు సంబంధించి స్థానిక అభిప్రాయాలను నేరుగా సేకరించనుంది.ఈ పర్యటనలను మరింత సమర్థవంతంగా చేయడానికి సంబంధిత సమా చారాన్ని ముందుగానే స్వీకరించేందుకు వివరణాత్మక ప్రశ్నావళి సిద్ధం చేసినట్లు కమిటీ హోం మంత్రికి తెలియజేసింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రి త్వ శాఖలతో కూడా సంప్రదింపులు జరిపేందుకు ప్రణాళికలు ఉన్నట్లు వెల్లడించింది. కమిటి వ్యూహాన్ని అభినందించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కమిటీ కార్యకలాపాలకు అన్ని విధాలైన సహాయ సహకారాలు అందించాలని హోం కార్యదర్శికి సూచి ంచారు. అలాగే కమిటీ తన సిఫార్సులను కేంద్రానికి వీలైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు. 2025 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉన్నత స్థాయి జనాభా మిషన్‌ను ప్రకటించారు.దీని కింద అక్రమ వలసలు, మతపరమైన మార్పులు ఇతర అసాధారణ కారణాల వల్ల ఏర్పడుతున్న జనా భా మార్పులను శాస్త్రీయంగా అధ్యయనం చేసి, తగిన విధానాలు, శాసనాలు పరిపాలనా చర్యలను సూచించేందుకు కేంద్ర హోంశాఖ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చైర్మన్ గా జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవ్లేకర్ (రిటైర్డ్) సభ్యులుగా జనగణన కమిషనర్, దుర్గా శంకర్ మిశ్రా (రిటైర్డ్ IAS), బాలాజీ శ్రీవాస్తవ (రిటైర్డ్ IPS), డాక్టర్ షమికా రవి (పీఎంఈఏసీ సభ్యురాలు)ఉన్నారు. ఈ కమిటీ దేశ వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న జనాభా మార్పులను ఖచ్చితంగా అంచనా వేసి, వాటి కారణాలను విశ్లేషించి, భవిష్యత్తు కోసం సమగ్ర సిఫార్సులు కేంద్రప్రభుత్వానికి చేయనుంది.కమిటి సిఫార్సులకు అనుగుణంగా దేశంలో అక్రమ వలసలు, అసాధారణ కారణాల వల్ల సంభవిస్తున్న జనాభా మార్పులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

## హైటెక్ డ్రోన్ పోలీసింగ్..

సరూర్‌నగర్ చెరువు పరిసర ప్రాంతాల్లో కొంతమంది యువకులు గుంపులుగా చేరి గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో పోలీసులు కొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా అనుమానాస్పద ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అనుమానితుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. తాజాగా డ్రోన్ నిఘాలో భాగంగా ఓ ఆటోలో కూర్చుని గంజాయి సేవిస్తున్న కొందరు యువకులు పోలీసుల దృష్టికి వచ్చారు. డ్రోన్ ద్వారా అందిన ప్రత్యక్ష దృశ్యాలను పరిశీలించిన అధికారులు వెంటనే సంబంధిత పోలీసు బృందాలకు సమాచారం అందించారు. అలర్ట్ అయిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గంజాయి సేవిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు. సాధారణంగా గుర్తించడం కష్టమయ్యే ప్రాంతాల్లో కూడా డ్రోన్ గస్తీ వల్ల నిఘా సాధ్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. చెరువులు, పార్కులు, ఖాళీ ప్రదేశాలు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తున్నారు. మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించిన మల్కాజిగిరి పోలీసులు, డ్రోన్ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగిస్తూ నేర నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేస్తున్నారు. గంజాయి విక్రయం, వినియోగం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో మరిన్ని ప్రాంతాలకు డ్రోన్ నిఘాను విస్తరించే యోచనలో పోలీసులు ఉన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి మాదకద్రవ్యాల నిర్మూలన, ప్రజా భద్రత పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు స్పష్టం చేశారు.

# వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి.

భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 01,** వర్షాకాలంలో ఇసుక లారీల రాకపోకల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రోడ్డు భద్రతకు భంగం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ సూచించారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎస్ఎండీసీ) అధికారులతో పాటు ఇసుక క్వారీ నిర్వాహకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ఇసుక లారీలను ప్రధాన రహదారులపై ఎట్టి పరిస్థితుల్లోనూ పార్కింగ్ చేయరాదని స్పష్టం చేశారు. క్వారీల వద్ద లేదా ముందుగానే గుర్తించిన అనువైన ప్రదేశాల్లోనే పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వర్షాకాలంలో రోడ్లపై బురద, ఇసుక పేరుకుపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లారీల నుంచి ఇసుక రోడ్డుపై చిందరపడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వాహనాల రాకపోకలను క్రమబద్ధంగా నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని సూచించారు.

పోలీసు శాఖ సూచనలు, ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఇసుక క్వారీ నిర్వాహకుడు, లారీ యజమాని తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో టీజీఎస్ఎండీసీ అధికారులు, ఇసుక క్వారీ నిర్వాహకులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీడీ కార్మికులతో ముచ్చటించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి కృషి చేస్తా



**సీ కే న్యూస్** బుధవారం తలమడుగు మండలంలోని పల్లి బి గ్రామంలో పర్యటించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బీడి కార్మికులతో ముచ్చటించారు. తిరుగు ప్రయాణంలో వీధిలో కూర్చొని బీడీలు చేస్తున్న మహిళలను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సరదాగా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం గ్రామంలో గల కల్వర్టులను పరిశీలించారు. కల్వర్టుల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి మొట్టే కిరణ్, నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, అబ్దుల్లా, శ్రీనివాస్, సుంకిడి సర్పంచ్ ప్రకాష్, మున్న, కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వైద్యుల దినోత్సవం--డాక్టర్ సుశీలకు ఘనసన్మానం



**పలమనేరు, జూలై 1, సీకే న్యూస్.** పలమనేర్ టౌన్ లో డాక్టర్ ఎస్ సుశీల ఎంబిబిఎస్ గా, అందిస్తున్న వైద్య సేవలు కొనియాడదగినవి. 30 రూపాయలు మాత్రమే ఔట్ పేషెంట్ ఫీజు తీసుకుంటూ... అతి తక్కువ ఖర్చుతో వైద్యం చేస్తున్న వైద్యురాలు సుశీల.

జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా..

పలమనేరు సామాజిక సేవా కార్యకర్త మధుమోహన్రావు సుశీల డాక్టర్కు శాలువా మహారాజా క్యాబ్ మెడల్ తో సత్కరించారు.

గడచిన 30 సంవత్సరాల నుండి ఈ విధమైన వైద్య సేవలు అందిస్తూ... అందరి మన్ననలు పొందుతున్నదని ఈ సందర్భంగా మధుమోహన్రావు ఆమెను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో మధుమోహన్రావు డాక్టర్ సుశీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ బాలకృష్ణకు ఘన సన్మానం -- విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన







**జఖ న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు జులై 01 2026:** మండలంలోని తూతకలింగన్నపేట గ్రామపంచాయతీ పరిధిలో గల గుడ్ న్యూస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏన్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు డాక్టర్ బాలకృష్ణకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, తగిన నిద్ర వంటి మంచి అలవాట్లను ప్రతి విద్యార్థి అలవరచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు అత్యంత కీలకమైన సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీససిటేషన్) గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండె స్పందన లేదా శ్వాస ఆగిపోయిన వ్యక్తికి సరైన సమయంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను రక్షించే అవకాశం ఉంటుందని వివరించారు. సీపీఆర్ నిర్వహించే ప్రాథమిక విధానాన్ని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించి, అత్యవసర పరిస్థితుల్లో ధైర్యంగా స్పందించి వెంటనే వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సమాజానికి వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, ప్రాణాలను కాపాడే వారి సేవలను గుర్తిస్తూ ప్రతి సంవత్సరం డాక్టర్స్ డేను నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. విద్యార్థులు వైద్య వృత్తి గొప్పతనాన్ని గుర్తించి సమాజ సేవ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సిస్టర్ అమల, జోస్లీమ్, తేజ, లక్ష్మీనారాయణ, కావ్య, కల్పనా, జ్యోతి, భావన, స్రవంతి, శశికళ, ఇంద్ర, శారద, నాగధీర్గ, సరోజ, శైలజతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ఇతర సిబ్బంది పాల్గొని డాక్టర్ బాలకృష్ణకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

# జన మైత్రి ఫౌండేషన్ ఫౌండర్ కి ఘన సన్మానం



ఫౌండర్ డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్

**సూర్యాపేట జిల్లా సి కె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా సామాజికవేత్త జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీ మునీర్ కి పతంజలి నిత్య యోగ సాధన తరపున స్థానిక చౌదరి ఫంక్షన్ హాల్ లో సన్మానం చేయడం జరిగింది.. ఈ సందర్భంగా డాక్టర్ మునీర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సామాజిక సేవా దృక్పథంతో పేదలకు వైద్యం అందిస్తున్నామని తెలియజేశారు అదేవిధంగా ప్రతినెల ఒకటవ తారీఖున జనయత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపులు కూడా నిర్వహిస్తున్నామని చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా యోగ ట్రైనర్ నాగేందర్ మాట్లాడుతూ అందరూ కూడా డాక్టర్ మునీర్ ని ఆదర్శంగా తీసుకొని ఎంతో కొంత సేవా చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, లక్ష్మి,రాజ్యలక్ష్మి,జ్యోతి , చంద్రకళ,విజయ, అరుణ, సింధు,సంధ్య, రమ,మంగ, ద్రౌపది, సుజాత, సరిత, కుమారి, మౌనిక, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు

## కొత్తగా వెంటనే పెద్ద బ్రిడ్జిని నిర్మించి ప్రయాణికుల కష్టాలను తీర్చాలి.



పోకల వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

**గరిడేపల్లి సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** నాగార్జునసాగర్ మెయిన్ కెనాల్ పై మర్రికుంట వద్ద ఆనాటి అవసరాలకు తగ్గట్టుగా బ్రిడ్జిని నిర్మించారని ఆ బ్రిడ్జిపై నేడు ప్రయాణించడానికి ప్రయాణికులు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని వెంటనే ప్రభుత్వం నేటి అవసరాలకు తగ్గట్టుగా పెద్ద బ్రిడ్జిని నిర్మించి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.సిపిఐ గరిడేపల్లి మండల సమితి ఆధ్వర్యంలో సాగర్ కెనాల్ పై గల బ్రిడ్జి వద్ద రాష్ట్ర రోకో నిర్వహించి ధర్నా చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఇరుకు వంతెన కారణంగా దశాబ్దాల కాలంగా ప్రయాణికులు ప్రయాణించడానికి అనేక అవస్థలు పడుతున్నారని ఒక వాహనం మాత్రమే వెళ్లే విదంగా ఇరుకు బ్రిడ్జి వున్నదని, ఒక వాహనం వెళ్తే ఎదురుగా మళ్లీ ఒక వాహనం రావడం కుదరదని,చిన్న బండి కూడా వచ్చే పరిస్థితి లేదని ఈ ఇరుకు వంతెన పై ప్రయాణించి అనేకమంది క్షతగాత్రులయ్యారని, ప్రమాదవశాత్తు కొంతమంది మరణించడం కూడా జరిగిందని అయినా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం రాకపోవడం బాధాకరమని ఆయన అన్నారు.అధికారం లోకి వచ్చిన అన్ని ప్రభుత్వాలు పాలకులు కూడా మేము ప్రజల కోసమే పని చేస్తున్నామని చెప్పడం తప్ప ఆచరణలో అదే రుజువు కావడం లేదని ఆయన అన్నారు.మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి నియోజకవర్గాన్ని వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారని,ఈ బ్రిడ్జిని నిర్మించటం వారికి చాలా చిన్న విషయమని, మరియు వారు ప్రస్తుతం నీటిపారుదల శాఖ మంత్రిగా కూడా ఉన్నందున వారి నియోజకవర్గంలోనే ఈ ఇరుకు వంతెన ఉన్నందున ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే కొత్త బ్రిడ్జిని నిర్మించి ఈ ప్రాంత ప్రజల కష్టాలను తీర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య ఏఐటీయు

సీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ త్రిపురం సుధాకర్ రెడ్డి,ఆకుల శ్రీను,అంబటి గోవిందరెడ్డి,పంగా ఈదయ్య, యాట సైదులు, నందిపాటి కరుణాకర్, నందిపాటి చిన్న కాశయ్య,చింతకాయల కొండలు,తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ స్విమర్స్ శివాని కర్ర, వృత్తి అగర్వాల్ లకు సన్మానం

**అభినందించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్**



**సి కె న్యూస్ ప్రతినిది హైదరాబాద్:**తెలంగాణ స్విమర్స్ శివాని కర్ర, వృత్తి అగర్వాల్ లను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అభినందించారు.

ఈరోజు సచివాలయంలో

తన చాంబర్లో వారిద్దరినీ సన్మానించారు

తెలంగాణ ఈత క్రీడాకారిణి శివాని కర్ర బ్యాంకాక్ లో జరగనున్న 12వ ఆసియన్ ఏజ్ గ్రూప్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్--2026లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం సంతోషకరమని

అదేవిధంగా వృత్తి అగర్వాల్ అహ్మదాబాద్‌లో జరిగిన 79వ సీనియర్ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్--2026లో అద్భుత ప్రదర్శన కనబరిచడము అట్లా ఆయన అభినందనలు తెలియజేశారు. 400 మీటర్ల, 800 మీటర్ల, 1500 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగాల్లో వరుసగా ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్య పతకాన్ని సాధించి తన ప్రతిభను చాటుకోవడం అంతేకాకుండా, 800 మీటర్ల ఫ్రీస్టైల్‌లో 9:05.47 నిమిషాల సమయంతో కొత్త జాతీయ రికార్డును, బెస్ట్ ఇండియన్ పెర్ఫార్మెన్స్‌ను నెలకొల్పింది. ఈ ప్రదర్శనతో 2011లో రిచా మిశ్రా నెలకొల్పిన 15 ఏళ్ల నాటి జాతీయ రికార్డును వృత్తి అధిగమించిండం అభినందనీయమని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోని బాలాదేవి మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శివాని కర్ర, వృత్తి అగర్వాల్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఉమేష్, కోచ్ ఆయుష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## తండా రోడ్లను బాగు చేయండి గిరిజనులకు న్యాయం చేయండి

మండల జేపీసీ గ్రామ సామాజిక సేవకర్త ధరావత్ నరసింహ



**చింతలపాలెం సీకే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు.** రాజకీయ నాయకులకు రిబ్బన్ కటింగ్ మీద ఉన్న తొందరపాటు రోడ్డు వేయడంలో లేకపోవడం బాధాకరం అని మండల జేపీసీ నాయకులు ఎర్రకుంట తండా గ్రామ సామాజిక సేవాకర్త ధరావత్ నరసింహ నాయక్ అన్నారు లేకపోతే తండాని వివక్ష చూపుతున్నారా మహాత్మా గాంధీ ముక్యాల లిఫ్ట్ కోసం తీసిన మట్టిని గ్రామాల రోడ్డు కోసం ఉపయోగించుకోవాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశించారు కానీ చింతలపాలెం నాయకులు పూర్తిస్థాయిలో చింతలపాలెం పొలాలకు పోయే రోడ్లని వేసుకొని తండా రోడ్లను విస్మరించారు మా ఎర్రకుంటతండాలో రెండు మట్టి రోడ్లను ప్రారంభించి 200 మీటర్లు కూడా వేయకుండా వదిలివేయడం జరిగింది గతంలో ఆ రోడ్ల పైన కనీసం ఆరక ఎడ్లు ,ట్రాక్టర్లు వెళ్లగలిగేవి ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేదు చింతలపాలెం మండల నాయకులకు నిజంగానే మా ఎర్రకుంట తండ మీద మీకు చిత్తశుద్ధి నిబద్ధత ఉంటే ఆ రెండు రోడ్లను పూర్తి చేసి ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చి మా తండా గిరిజనులకు న్యాయం చేయాలని తక్షణమే రోడ్డును బాగు చేసి మా గిరిజన రైతులకు గిఫ్టుగా ఇచ్చి వారి మన్ననలు పొందాలని వారి అభిమానాన్ని చాటుకోవాలని వారు అన్నారు

## చేగుంట పట్టణ డాక్టర్లకు ఘన సన్మానం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో



**జూలై 01 (సీ కే న్యూస్) చేగుంట** :చేగుంట మండల కేంద్రంలోనీ గల డాక్టర్స్ అందరికీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేగుంట అధ్యక్షులు రజనకు రాంచంద్రం డాక్టర్స్ డే, వేడుకలు ఘనంగా నిర్వహించి. వారిని శాలువలతో సత్కరించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.ప్రజలకు కంటికి కనిపించే దేవుళ్లు డాక్టర్లు అని, ప్రాణదాతలు వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని వారు కొనియాడారు.అలాగే నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం శ్రమించే వారిని గుర్తించి సన్మానించడం.. వారిపై ఉన్న గౌరవంతో పాటు భవిష్యత్తులో వారు మరింత బాధ్యతగా పనిచేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో చేగుంట లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా రజనకు రాంచంద్రం కార్యదర్శి బుర్కా నాగరాజు, కోశాధికారి దుర్గం అనిల్ కుమార్ ఎన్నికయ్యారు..

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్రోల్మెంట్(చేరికలు) పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి...

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**పెబ్బేరు జులై01 (సి కే న్యూస్)** ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత విద్యను ప్రాధాన్యతగా బోధించాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యా కార్యక్రమాలు, పాఠశాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నమోదు(ఎన్రోల్మెంట్),ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు, ఏఐ తరగతుల నిర్వహణ,అపార్ ఐడీల నమోదు, కొత్తగా చేరిన విద్యార్థుల యూడైస్ వివరాల నమోదు వంటి అంశాలపై ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్య పెంపునకు తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఏఐ తరగతులను క్రమబద్ధమైన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, ప్రతి విద్యార్థి తన సొంత ఐడీ ద్వారా శిక్షణ పొందేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం శ్రీరంగాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను సందర్శించి వంటశాలను తనిఖీ చేసిన కలెక్టర్ నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం స్టాక్ రూమ్ సందర్శించి మెస్ కమిటీ నిర్వహణ కొనసాగుతుందా లేదా అని ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్లు మెస్ కమిటీ విద్యార్థుల సంతకాల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం,వసతుల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, గత విద్యా సంవత్సరంలో సీనియర్స్ సాధించిన 100 శాతం ఉత్తీర్ణతను




స్ఫూర్తిగా తీసుకొని,ఈ ఏడాది కూడా విద్యార్థులు 100% ఉత్తీర్ణులు అయ్యేలా లక్ష్యంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠ్యపుస్తకాల పంపిణీని పూర్తిచేయడంతో పాటు కంప్యూటర్ తరగతులను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం శ్రీరంగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, గ్రామ సర్పంచ్‌తో గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజా సమస్యలు తదితర అంశాలపై చర్చించి వివరాలు తెలుసుకున్నారు.

**పెబ్బేరు మున్సిపాలిటీ చెలిమిల్ల పాఠశాల తనిఖీ**

పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని చెలిమిల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అసంపూర్తిగా ఉన్న అదనపు పాఠశాల భవనాన్ని పరిశీలించారు. భవనం వినియోగంలోకి రావడానికి అవసరమైన పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటుక పనులు (బ్రిక్ వర్క్) పూర్తి చేసి భవనాన్ని త్వరగా వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జెడ్పి సీఈవో యాదయ్య, శ్రీరంగాపూర్ సర్పంచ్ మద్దిలేటి, ఇతర మండల అధికారులు తదితరులు ఉన్నారు.

# 16 నుంచి తెలంగాణ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



**సి కే న్యూస్ హైదరాబాద్, (క్రీడా ప్రతినిధి)** యోనెక్స్--సన్‌రైజ్ 12వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అండర్-15 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2026 ఈ నెల 16 నుంచి 19 వరకు మణికొండలోని మ్యాచ్ పాయింట్ ఫ్రైడ్ అకాడమీలో జరగనున్నట్లు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్, రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఈ నెల 13లోగా తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన అండర్-15 షట్లర్లకు ఈ చాంపియన్‌షిప్ మంచి వేదికగా నిలుస్తుందని తెలిపారు.

ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు రాష్ట్ర స్థాయిలో తమ సత్తా చాటుకునే అవకాశం లభిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. బాలబాలికల్లో బ్యాడ్మింటన్ పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు ఇటువంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ చాంపియన్‌షిప్ ద్వారా భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో రాణించే ప్రతిభావంతులైన షట్లర్లను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సామ ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చిప్ప ప్రభాకర్, కార్యదర్శి పోకూరి ఆనంద్‌బాబు, కోచ్‌తో పాటు మ్యాచ్ పాయింట్ అకాడమీ అధినేత ఎం. వేణు, సమన్వయ కమిటీ సభ్యులు పి. సాయిరెడ్డి, డి. రఘురాం, ఎం. శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొనున్నారు

# ఎస్ యు ఫంక్షన్ హాల్ నూతన ప్రారంభోత్సవం

- మండలయూత్ నాయకులు కంటెస్టెడ్ సర్పంచ్ ఓరుగంటి చిరంజీవి



**గరిడేపల్లి సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** మండల పరిధిలో ఉన్న ఎల్బీనగర్ గ్రామ సమీపంలో ఎస్ యు ఫంక్షన్ హాల్ నూతన ప్రారంభోత్సవానికి ఎల్బీనగర్ గ్రామకాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మండల యూత్ నాయకులు కంటెస్టెంట్ సర్పంచ్ ఓరుగంటి చిరంజీవి ఫంక్షన్ హాల్ నిర్వాహకులు పోనుగోడు గ్రామానికి చెందిన సుందరి వెంకన్న ఆహ్వానం మేరకు పూజా కార్యక్రమంలో పాల్గొని వారిని ఆనందింప చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫంక్షన్ హాల్ నిర్వాహకులు సుందరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# అంగన్‌వాడీ టీచర్‌ను వేధించి డబ్బులు డిమాండ్ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అరెస్ట్

- ఆర్టీఐ పేరుతో బెదిరించి రూ.50 వేల డిమాండ్
- నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన బోథ్ పోలీసులు
- బోథ్ సిఐ డి గురుస్వామి
- అరెస్టు చేసిన నిందితుడు :
- రాథోడ్ రాజు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఘన్పూర్ గ్రామం, సొనాల మండలం




**సికే న్యూస్ ప్రతినిధి** జన్నారం మండలంలో విధులు నిర్వర్తిస్తున్న సొనాల మండలం ఘన్పూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాథోడ్ రాజు, అదే గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ రాథోడ్ విమలను గత కొంతకాలంగా ఉద్యోగపరంగా వేధింపులకు గురి చేస్తూ, ఆర్టీఐ చట్టం ద్వారా ఆమె వ్యక్తిగత, ఉద్యోగ వివరాలు సేకరించి ఉద్యోగం పోయేలా చేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలా చేయకుండా ఉండాలంటే రూ.50,000 నగదు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బాధితురాలు తెలిపింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా, ఆమె కుమారుడు శ్రీనివాస్ బోథ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు రాథోడ్ రాజును అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు బోథ్ సీఐ డి. గురుస్వామి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ అధికారాన్ని లేదా చట్టాలను దుర్వినియోగం చేసి ప్రజలను బెదిరించడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సీఐ డి. గురుస్వామి హెచ్చరించారు. బాధితులు ఎవరైనా ఇతని ద్వారా మోసపోయి ఉంటే జిల్లా పోలీసు యంత్రాంగానే సంప్రదించవచ్చని తెలిపారు.

# పదో తరగతి పరీక్షలో డమ్మీ అభ్యర్థితో పరీక్ష రాయించిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 01,** పదో తరగతి పబ్లిక్ పరీక్షలో అసలు అభ్యర్థికి బదులుగా మరొకరితో పరీక్ష రాయించిన కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ కె. సాయి మంగళవారం తీర్పు వెలువరించారు.

కేసు వివరాల ప్రకారం, 2019 నవంబర్ 4న నిర్వహించిన పదో తరగతి సోషల్ స్టడీస్ పబ్లిక్ పరీక్ష సందర్భంగా కొత్తగూడెంలోని లిటిల్ బర్డ్స్ పాఠశాలలో నిర్వహించిన తనిఖీల్లో, అసలు అభ్యర్థి తెల్లం అనిల్ స్థానంలో పూనెం సందీప్ పరీక్ష రాస్తున్నట్లు స్క్వాడ్ అధికారులు గుర్తించారు. హాల్ టికెట్‌ను పరిశీలించి అక్రమం జరిగినట్లు నిర్ధారించిన అనంతరం, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కుసుమ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అప్పటి కొత్తగూడెం టౌన్ ఎస్సై పి. రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం సేకరించిన ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలు, పత్రాలను పరిశీలించిన కోర్టు నిందితులపై అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించింది.

దీంతో, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీసెస్ అండ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం, 1997లోని సెక్షన్ 8 కింద మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా, అలాగే సెక్షన్ 419 ఐపీసీ కింద ఒక సంవత్సరం జైలు శిక్ష విధించింది. ఈ రెండు శిక్షలను ఏకకాలంలో అనుభవించాలని కోర్టు తన తీర్పులో పేర్కొంది.

ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నార్సింగ్ అనిల్ కుమార్ వాదనలు వినిపించగా, కోర్టు నోడల్ అధికారి ఎస్సై డి. రాఘవయ్య (కోర్టు డ్యూటీ ఆఫీసర్), డి. కామేశ్వరరావు సమన్వయం అందించారు.

# చింతకాని ప్రీ-ప్రైమరీ స్కూల్ ప్రారంభం.. చిన్నారులకు యూనిఫాంలు, విద్యా కిట్ల పంపిణీ.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ-ప్రైమరీ స్కూల్‌ను ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు యూనిఫాంలతో పాటు విద్యా కిట్లను పంపిణీ చేసి వారి విద్యాభ్యాసానికి శుభారంభం పలికారు. ఈ సందర్భంగా చిన్నారులకు షూస్, సాక్స్, బెల్ట్, పలక, పెన్సిల్ సెట్, డ్రాయింగ్ బుక్, కలర్ పెన్సిల్స్‌తో కూడిన కిట్లను అందజేశారు. చిన్ననాటి నుంచే నాణ్యమైన విద్య, పరిశుభ్రత, క్రమశిక్షణ, సృజనాత్మకత అలవడేలా ప్రభుత్వం ప్రీ-ప్రైమరీ విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. చిన్నారులు ఆనందంగా పాఠశాలకు రావడం, ఆటలతో పాటు అభ్యాసాన్ని ఆస్వాదించడం, వారి మానసిక, శారీరక, సామాజిక వికాసానికి ఇలాంటి విద్యా వాతావరణం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. పిల్లలే దేశ భవిష్యత్తుకు బలమైన పునాదులని, వారికి అందించే ప్రతి అవకాశం వారి ఉన్నత భవిష్యత్తుకు పెట్టుబడిగా నిలుస్తుందని అన్నారు. ప్రతి చిన్నారి ఆత్మవిశ్వాసంతో, ఆనందంగా చదువుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రీ-ప్రైమరీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్ యరమల రామకృష్ణ, ఆయా డి. శైలజ, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.ప

# వనజీవి రామయ్య చూపిన బాటలో... పచ్చదనం పెంపొందిద్దాం: గ్రీన్ భద్రాద్రి ప్రెసిడెంట్ రామకృష్ణ రెడ్డి.

**పద్మశ్రీ వనజీవి రామయ్య జయంతి సందర్భంగా అభయాంజనేయ పార్కులో మొక్కను నాటిన గ్రీన్ భద్రాద్రి.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూలై 01:** పర్యావరణ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసి, లక్షలాది మొక్కలను నాటి "వనజీవి"గా చిరస్థాయిగా నిలిచిన పద్మశ్రీ లేట్ వనజీవి రామయ్య జయంతి సందర్భంగా భద్రాచలంలోని అభయాంజనేయ పార్కులో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యం లో మొక్కను నాటారు. ముందుగా వనజీవి రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, "వనజీవి రామయ్య చూపిన హరితబాట ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం. ఆయన ఆశయాలను కార్యరూపంలోకి తీసుకురావడం మనందరి బాధ్యత. భద్రాచలాన్ని సంపూర్ణ హరిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు గ్రీన్ భద్రాద్రి నిరంతరం కృషి చేస్తుంది. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను స్వచ్ఛందంగా తీసుకోవాలి. మొక్కలు నాటడం ఒకరోజు కార్యక్రమం కాదు.. భావితరాల భవిష్యత్తును కాపాడే సామాజిక బాధ్యత. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. వనజీవి రామయ్య కలలుగన్న పచ్చని భద్రాచలాన్ని సాకారం చేయడమే గ్రీన్ భద్రాద్రి లక్ష్యం" అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వృక్షమిత్ర అవార్డు గ్రహీత డాక్టర్ గొళ్ల భూపతిరావు, గ్రీన్ భద్రాద్రి కార్యదర్శి భూక్యా రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి, భద్రాచలం వనజీవి సంపత్ శ్రీరంగం, పార్క్ కృష్ణ, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేడి స్వామికి జీవన్ రక్షక్ పురస్కారం-2026 అందజేత

- అవార్డు అందజేస్తున్న సినీ రాజకీయ నాయకులు డా బాబూమోహన్ గారు



**సి కె న్యూస్ ఆత్మకూరు యం రిపోర్టర్ షేక్ అజీజ్ :** ఆత్మకూర్ మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన యువ జర్నలిస్ట్ రక్త దాత మేడి స్వామికి హైదరాబాద్ రవీంద్రభారతి లో డాక్టర్స్ డే సందర్భంగా జీవన్ రక్షక్ పురస్కారం అవార్డు-2026 సినీ యాక్టర్ మాజీ ఎమ్మెల్యే రాజకీయ నాయకులు డా,బాబూమోహన్ చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం జరిగింది గ్రామీణ ప్రాంతాల్లో రక్త దాతగా సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా అందిస్తున్న విశేష సేవలను గుర్తుంచి. ఈ పురస్కారం చేసినట్లు మేడిది సుబ్బారావు ట్రస్ట్ మరియు పీపుల్ మీడియా పాయింట్ వారు తెలిపారు.

# జాతి సేవే లక్ష్యంగా.. సేవాలాల్ సేనలో వినోద్ కుమార్ కు కీలక బాధ్యతలు



**సీ కే న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు జులై 02 2026:** ఏన్కూర్ మండలం హిమామ్ నగర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త భూక్యా వినోద్ కుమార్‌కు సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా కో-కన్వీనర్‌గా కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర కేంద్ర కమిటీ అధికారిక నియామక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర అధ్యక్షులు బాణోత్ హుస్సేన్ నాయక్, వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు భూక్యా సంజీవ్ నాయక్ ఆదేశాల మేరకు జిల్లా గౌరవ అధ్యక్షులు భూక్యా నరసింహారావు నియామక పత్రాన్ని వినోద్ కుమార్‌కు అందజేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని, వినోద్ కుమార్ అనుభవం, నాయకత్వ సామర్థ్యంతో సంస్థ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది.

ఈ సందర్భంగా భూక్యా వినోద్ కుమార్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర, జిల్లా కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. జాతి ఐక్యత, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. రాష్ట్ర, జాతీయ నాయకుల మార్గదర్శకత్వంలో సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

భూక్యా వినోద్ కుమార్ నియామకాన్ని స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పి.వి. నరసింహారావు జయంతి




**జులై (01) సి కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి.**
భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్‌లో గల శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు డా. కె. కేశవరావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి సభకు అధ్యక్షత వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డా. వి. కిషన్‌రావు గౌరవ అతిథిగా పాల్గొనగా, భారతరత్న పి.వి. నరసింహారావు కుమారుడు శ్రీ పి.వి. ప్రభాకర్‌రావు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా డా. కె. కేశవరావు మాట్లాడుతూ, పి.వి. నరసింహారావు భారత ఆర్థిక పునరుజ్జీవనానికి శిల్పి అని కొనియాడారు. 1991లో దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ఆయన దూరదృష్టి, ధైర్యవంతమైన ఆర్థిక సంస్కరణల ద్వారా భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక రంగంలో గౌరవనీయమైన స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఆయన చేపట్టిన సంస్కరణలు నేటికీ దేశ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు.
సభకు అధ్యక్షత వహించిన డా. కె.వి. రమణాచారి (విశ్రాంత ఐఏఎస్) మాట్లాడుతూ, పి.వి. నరసింహారావు అసాధారణ రాజనీతిజ్ఞుడు, గొప్ప పండితుడు, బహుభాషా కోవిదుడు, సాహితీవేత్త, దూరదృష్టి కలిగిన సంస్కరణవాది అని పేర్కొన్నారు. ప్రజాజీవితంలో నిజాయితీ, పారదర్శకత, ప్రజాస్వామ్య విలువలను ఆయన అత్యున్నత స్థాయిలో పాటించారని, అందువల్ల భారత చరిత్రలోనే కాకుండా తెలుగు ప్రజల హృదయాల్లోనూ చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.
గౌరవ అతిథి డా. వి. కిషన్‌రావు మాట్లాడుతూ, విద్య, పరిశోధన, సాహిత్యం, భాషల అభివృద్ధికి పి.వి. నరసింహారావు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. భారతీయ, విదేశీ భాషలపై ఆయనకు ఉన్న అపారమైన పట్టు ఆయన మేధస్సుకు, నిరంతర అధ్యయనానికి నిదర్శనమని పేర్కొంటూ, యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని జ్ఞాన సాధనలో ముందుకు సా
ని పిలుపునిచ్చారు.
ప్రత్యేక అతిథి శ్రీ పి.వి. ప్రభాకర్‌రావు మాట్లాడుతూ, తన తండ్రి జ్ఞానాన్నే మనిషి సంపాదించగల అత్యంత విలువైన సంపదగా భావించేవారని అన్నారు. 1991 ఆర్థిక సంస్కరణలను ప్రస్తావిస్తూ, ఆధునిక ఆర్థిక శక్తిగా, సమాచార సాంకేతిక రంగంలో ప్రపంచస్థాయి దేశంగా భారతదేశం ఎదగడానికి పి.వి. నరసింహారావు బలమైన పునాది వేశారని చెప్పారు. రాజకీయాలకే పరిమితం కాకుండా ఆర్థిక శాస్త్రం, సాహిత్యం, చరిత్ర, తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, ఖగోళశాస్త్రం వంటి అనేక రంగాల్లో ఆయనకు విశేష ఆసక్తి ఉండేదని పేర్కొన్నారు. చివరి వరకు నిరంతరం అధ్యయనం చేస్తూ జీవితాంతం విద్యార్థిగానే కొనసాగారని స్మరించుకున్నారు. యువత దేశభక్తి, క్రమశిక్షణ, నిజాయితీ, దేశసేవ పట్ల అంకితభావం వంటి పి.వి. ఆదర్శాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, రచయితలు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, పి.వి. నరసింహారావు అభిమానులు పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీవైజేఎఫ్) అధ్యక్షులు డా. జితేందర్ రావు తనుగుల కూడా పాల్గొన్నారు.
భారతరత్న పి.వి. నరసింహారావు జీవితం, సేవలు, వారసత్వం భావితరాలకు నిరంతర స్ఫూర్తిగా నిలుస్తూ భారత ప్రజాస్వామ్య, మేధో, ఆర్థిక ప్రగతికి మార్గదర్శకంగా కొనసాగుతాయని వక్తలు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు.

## వనజీవి రామయ్య ఆశయస్ఫూర్తితో మొక్కలు నాటాలి



**సి కే న్యూస్ :ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు జులై 02 2026:** వనజీవి రామయ్య జయంతి సందర్భంగా ఏన్కూరు మండల పరిధిలోని ఎఫ్‌సీఐ గోడౌన్ ఆవరణలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంటూ సాంబయ్య మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణకు తన జీవితాన్నే అంకితం చేసిన వనజీవి రామయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమన్నారు.
ప్రస్తుతం అడవుల నరికివేత, పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆక్సిజన్, తాగునీరు, తగినంత వర్షపాతం వంటి సహజ వనరుల కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు.
వనజీవి రామయ్యను ఆదర్శంగా తీసుకొని ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం పచ్చదనంతో కళకళలాడేలా కృషి చేయాలని, పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ముందుకు రావాలని కొంటూ సాంబయ్య కోరారు.

# గ్రంథాలయాల అభివృద్ధి పై ప్రత్యేక సమీక్ష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా



**సి కే న్యూస్** జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.. ఎర్రుపాలెం, మధిర, మడుపల్లి శాఖ గ్రంథాలయాలను సందర్శించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ ఎం.డి. ఖాదర్ బాబా గారు
జిల్లాలోని శాఖ గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులకు మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ ఎం.డి. ఖాదర్ బాబా గారు ఎర్రుపాలెం, మధిర, మడుపల్లి శాఖ గ్రంథాలయాలను సందర్శించి గ్రంథాలయ భవనాలు, మౌలిక సదుపాయాలు, పాఠకులకు అందుతున్న సేవలు, నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి గ్రంథాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రంథాలయ సభ్యులు, పాఠకులు, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని అభివృద్ధి అవసరాలను స్వయంగా పరిశీలించారు.
ఎర్రుపాలెం శాఖ గ్రంథాలయంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ ఇస్మాయిల్ గారు, కాంగ్రెస్ నాయకులు శ్రీ కంచర్ల వెంకట నరసయ్య గారు, పార్టీ ప్రధాన కార్యదర్శి, మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు మరియు ఇతర నాయకులు గ్రంథాలయంలోని సమస్యలను చైర్మన్ గారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రహరీ గోడ నిర్మాణం, మరుగుదొడ్ల ఏర్పాటు, కిటికీల ఏర్పాటు, భవనానికి పెయింటింగ్, విద్యుత్ సౌకర్యాల కల్పన వంటి అభివృద్ధి పనులను పరిశీలించిన చైర్మన్ గారు, అందుబాటులో ఉండే నిధులను బట్టి దశలవారీగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.
మధిర పట్టణ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ సభ్యులు, పాఠకులు, విద్యార్థుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించిన శ్రీ ఎం.డి. ఖాదర్ బాబా గారు, తాజా స్టడీ మెటీరియల్, ఉద్యోగ మరియు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, దినపత్రికలు, వారపత్రికలు, మ్యాగజైన్లు, సాధారణ విజ్ఞాన పుస్తకాలను అందుబాటులో ఉంచడంతో పాటు భవనానికి మరమ్మతులు, పెయింటింగ్ తదితర అంశాలను పరిశీలించి, అందుబాటులో ఉండే నిధులను బట్టి అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించి గ్రంథాలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.
మడుపల్లి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ భవనం, ప్రాంగణం, పాఠకులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ ఎం.డి. ఖాదర్ బాబా గారు, గ్రంథాలయ సభ్యులు, పాఠకులు, విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకొని వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి తాజా స్టడీ మెటీరియల్, కొత్త పుస్తకాలు, ఉద్యోగ, పోటీ పరీక్షల మెటీరియల్, దినపత్రికలు, వారపత్రికలు, మ్యాగజైన్లు, సాధారణ విజ్ఞాన పుస్తకాలను అందుబాటులో ఉంచడంతో పాటు, గ్రంథాలయ భవనానికి మరమ్మతులు, పెయింటింగ్, ప్రహరీ గోడ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని సభ్యులు కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ గారు, గ్రంథాలయంలోని అన్ని సమస్యలను సానుకూలంగా పరిశీలించి, అందుబాటులో ఉండే నిధులను బట్టి దశలవారీగా అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ ఎం.డి. ఖాదర్ బాబా గారు మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి శాఖ గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయడం జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రధాన లక్ష్యమని, గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ, పాఠకులకు నాణ్యమైన గ్రంథాలయ సేవలు, మెరుగైన అధ్యయన వాతావరణం కల్పించేందుకు అందుబాటులో ఉండే నిధులను సమర్థవంతంగా వినియోగిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెంలో శ్రీ ఇస్మాయిల్ గారు, శ్రీ కంచర్ల వెంకట నరసయ్య గారు తదితరులు పాల్గొన్నారు. మధిరలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శ్రీ కోనాధని కుమార్ గారు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ పారుపల్లి విజయ్ కుమార్ గారు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ తలుపుల వెంకటేశ్వర్లు గారు, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీమతి నకిరికంటి రాజేశ్వరి గారు, శ్రీ షేక్ రసీదున్ గారు, జిల్లా కాంగ్రెస్ నాయకులు శ్రీ మిర్యాల వెంకటరమణ గుప్తా గారు, కాంగ్రెస్ నాయకులు శ్రీ వెంకయ్య బాబు గారు, శ్రీ మోదుగు బాబు గారు, శ్రీమతి అద్దంకి మంజీరా గారు, శ్రీ సాలిక సురేష్ గారు, శ్రీ జాకీర్ హుస్సేన్ గారు, శ్రీ తోట సాయి గారు, శ్రీ మైలవరపు చక్రి గారు, శ్రీ నాగ మురళి గారు, శ్రీ గాలి ప్రసాద్ గారు పాల్గొన్నారు. మడుపల్లిలో మధిర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శ్రీ కోనాధని కుమార్ గారు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ పారుపల్లి విజయ్ కుమార్ గారు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ తలుపుల వెంకటేశ్వర్లు గారు, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీమతి నకిరికంటి రాజేశ్వరి గారు, శ్రీ షేక్ రసీదున్ గారు, కాంగ్రెస్ నాయకులు శ్రీ ఓట్ల కృష్ణమూర్తి గారు, శ్రీ చింతల రాము గారు, శ్రీ ధర్మపురి నరసింహారావు గారు, శ్రీ వెంకటనారాయణ గారు, శ్రీ ఏసు గారు, శ్రీ పోగు రామారావు గారు, శ్రీ సాంబశివరావు గారు, శ్రీ వెంకటేశులు గారు, శ్రీ స్లీపర్ విజయ్ కుమార్ గారు, గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీమతి నాగలక్ష్మి గారు, జిల్లా కాంగ్రెస్ నాయకులు శ్రీ మిర్యాల వెంకటరమణ గుప్తా గారు, కాంగ్రెస్ నాయకులు శ్రీ వెంకయ్య బాబు గారు, శ్రీ మోదుగు బాబు గారు, శ్రీమతి అద్దంకి మంజీరా గారు, శ్రీ సాలిక సురేష్ గారు తదితరులు పాల్గొన్నారు.

**సి కె న్యూస్** గంగారం మండలం పందెం గ్రామంలో భూ భారతి రీ సర్వే గురించి ఎలా సర్వే చేసుకోవాలి అనే వివరిస్తున్న వీ=ూ సార్ బాలకృష్ణ తో కోడిశలమిట్ట సర్పంచ్ బచ్చల లక్ష్మణ్ రావు. గుంజేడు ముసలమ్మ ట్రస్ట్ డైరెక్టర్ పుల్సం సురేష్. జు=ు సర్పంచ్ బచ్చల వెనకన్న గారు
గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు



# ఏజెన్సీ ప్రాంత జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపాలి



టీయూడబ్ల్యూజే (ఐజేయు) సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్

**కొత్తగూడ, జూలై 1:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్, ఐజేయు కొత్తగూడ మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడ మండలంలోని గుంజేడు ముసలమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణంలో మండల అధ్యక్షుడు ఎస్.కె. సల్మాన్ పాషా అధ్యక్షతన బుధవారం సభ్యత్వాల పునరుద్ధరణ మరియు నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు దూలం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు శ్రీ చిత్తనూరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ గాడిపెల్లి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, జర్నలిస్టుల ఐక్యతే యూనియన్ బలోపేతానికి మూలమని అన్నారు. ప్రతి జర్నలిస్టు యూనియన్ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడంతో పాటు కొత్తగా అర్హులైన జర్నలిస్టులు సభ్యత్వం పొందాలని సూచించారు. యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు.
ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు అనేక ఇబ్బందులు, మౌలిక సదుపాయాల కొరత, రవాణా సమస్యలు, వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.
ఏజెన్సీ ప్రాంత ముద్దుబిడ్డ, రాష్ట్ర మంత్రి శ్రీమతి సీతక్క ఈ అంశంపై ప్రత్యేక చొరవ చూపి, ఏజెన్సీ ప్రాంత జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నందున వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.
అనంతరం సభ్యులందరూ సభ్యత్వాల పునరుద్ధరణతో పాటు కొత్త సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశంలో యూనియన్ బలోపేతం, సభ్యుల ఐక్యత, జర్నలిస్టుల సంక్షేమం కోసం జిల్లా కమిటీ చేపట్టే కార్యక్రమాలకు పూర్తి సహకారం అందించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉమ్మగాని మధు,రమణ, సత్యనారాయణ, కోరే పాపన్న, రావూరి ప్రశాంత్, పాలడుగు శ్రీధర్, జంగాల వినయ్ కుమార్, మహమ్మద్ అజ్మీర్, శెట్టి పరశురాములు, మండల ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, మండల ముఖ్య సలహాదారులు సునీల్, ప్రచార కార్యదర్శులు ఉబ్బని శ్రీహరి, తీగల ప్రేమ్ సాగర్, రాకేష్ వర్మ, చాపల శ్రీనివాస్, నాంపల్లి రాజ్ కుమార్, వాసం వెంకటేష్, తాటి సుదర్శన్, బిక్షపతి, యూనియన్ నాయకులు, మండల ప్రతినిధులు, సభ్యులు మరియు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పాఠశాలకు పహరి గోడ భూమి పూజ సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే



**సికె న్యూస్ కొల్చారం నర్సాపూర్** మెదక్ జిల్లా కొల్చారం మండలం హంసన్పల్లి గ్రామంలో పాఠశాలకు భారీ గోడకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే అలాగే సిసి రోడ్డుకు భూమి పూజ చేసి తొందరగా పనులు వేగవంతం చేస్తామని అన్నారు ఈ సందర్భంగా సర్పంచ్ అంసన్పల్లి మాట్లాడుతూ నిధులు ఎప్పుడు ఎదురు చూసి గ్రామ ప్రజలు సిసి రోడ్లు గ్రామ పాఠశాలకు ప్రహరీ గోడకు నిధులు మంజూరు అయ్యాయంటని గ్రామ సర్పంచ్ తెలిపారు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా టిఆర్ఎస్ సర్పంచులు ఏ గ్రామంలో నికి ఎలాంటి ఎలాంటి ఇబ్బందులు తీసుకురావద్దని నరసాపురం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ డ్రైనేజ్ గాని విద్యుత్ దీపాలు గాని అక్కడక్కడ ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతే ఇంటనే తీసుకువెళ్లి చేపిచ్చుకొచ్చి తాగినీటి సమస్యలకు ఇబ్బంది కలవకుండా చర్యలు తీసుకోవాలని టిఆర్ఎస్ పార్టీ సర్పంచులకు చెప్పిన నర్సాపూర్ ఎమ్మెల్యే చింత లక్ష్మారెడ్డిఇప్పటికైనా వివిధ గ్రామ సర్పంచులు వార్డ్ నెంబరు భారీ ఎత్తున పాల్గొన్నారు

# మైసు మణెమ్మ మృతికి కాంగ్రెస్ నాయకుల నివాళి



**కొత్తగూడ:సి కె న్యూస్** మండల కేంద్రానికి చెందిన మైసు మణెమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె నివాసానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య మాట్లాడుతూ, మణెమ్మ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు విరనేని వెంకటేశ్వర్లు, టౌన్ ఉపాధ్యక్షులు వెలుదండి వేణు, కాంగ్రెస్ నాయకులు యాదగిరి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొని మైసు మణెమ్మకు నివాళు లర్పించారు.

# పెళ్లికి వెళ్ళి తిరిగి వస్తుండగా, ఆటో బోల్తా పలువురికి తీవ్ర గాయాలు,



**జూలై 01 (సీ కే న్యూస్) చేగుంట :** చిన్న శంకరంపేట నుండి చేగుంటకు వస్తున్న ఆటో బోల్తా పడి పదిమందికి తీవ్ర గాయాలు అయిన ఘటన, చేగుంట మండల కేంద్రం చోటుచేసుకుంది, స్థానికుల వివరాల ప్రకారం చేగుంట గ్రామస్తులు తమ సమీప బంధువుల పెళ్లి కోసం చిన్న శంకరంపేట్ గ్రామానికి పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి, వారిని సమీప ఆస్పత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు, సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు,

# SIR కార్యక్రమాన్ని సందర్శించిన గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి



బాసు హనుమంతు నాయుడు గారు

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల్

ఈరోజు గద్వాల నియోజకవర్గం గట్టులి మండలం బోయలగూడెం గ్రామంలో భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని గ్రామ పార్టీ దీూా,దీూా లతో కలిసి, బాసు హనుమంతు నాయుడు గారు సందర్శించారు....

అంతక ముందు,గ్రామంలో గట్టు మీద వెలిసిన శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఆశీస్సులను పొందారు.....

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

ూ×= ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను ప్రతి అర్హుడైన ఓటరికి అందజేసి, వాటిని సక్రమంగా నింపి నిర్ణీత గడువులోగా సమర్పించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని దీ=ూ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లను కోరారు.... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు...భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ూ×=) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని బాసు హనుమంతు నాయుడు గారు ఆకాంక్షించారు...

ఈ కార్యక్రమంలో కప్పగంటి నాగరాజు,నూర్ పాషా,బి.కె.వెంకటేష్, కాంచన లింగన్న,రాజ్ గోపాల్,సామెలు, జంగం రవి, ఉప్పరి మంజు, శ్రీనివాసులు,రాజు,రాముడు,మరియు గ్రామ నాయకులు,కార్యకర్తలు,దీూా లు తదితరులు పాల్గొన్నారు.....

# బాణాపురంలో రూ.1.30 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





## ఉపముఖ్యమంత్రికి బ్రహ్మరథం పట్టిన ముదిగొండ మండలం గ్రామస్తులు

## పూలవర్షం, మంగళహారతులు, గజమాలతో ఘనస్వాగతం

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:

ముదిగొండ మండల పరిధిలోని బాణాపురం, వల్లభి గ్రామాలలో గురువారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బాణాపురం గ్రామంలో రూ. కోటి 30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

రూ.1.30 కోట్లతో పనుల వివరాలు:

బాణాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.1 కోటి అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిమెంట్ రహదారుల పనులకు ఉపముఖ్యమంత్రి భూమిపూజ చేశారు.

బాణాపురం నుంచి పెదమండవ ఆర్ అండ్ బి రోడ్డు వరకు రూ.30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న 1000 ఎమ్ ఎమ్ సి పైప్ కల్వర్ట్ (4 వీటి), రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

అడుగడుగునా బ్రహ్మరథం.. జననీరాజనం!

ఉపముఖ్యమంత్రి హోదాలో తమ గ్రామానికి విచ్చేసిన భట్టి విక్రమార్కకు వల్లభి, బాణాపురం గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. గ్రామంలో పర్యటిస్తున్న క్రమంలో స్థానిక మహిళలు, అడుగడుగునా మంగళహారతులు పడుతూ, పూలవర్షం కురిపిస్తూ తిలకం దిద్దారు. మరికొందరు బాణాసంచా కాలుస్తూ పండుగ వాతావరణాన్ని తలపించేలా చేశారు. ?గ్రామస్తులు, స్థానిక నాయకులు భారీ ఎత్తున తరలివచ్చి డిప్యూటీ సీఎంకు భారీ గజమాలను వేసి ఘనంగా సన్మానించారు. పనుల శంకుస్థాపన నిమిత్తం గ్రామ వీధుల్లో నడుచుకుంటూ వెళ్తున్న ఉపముఖ్యమంత్రి వెంట ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్త కళ్ళ అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలో మూడు పువ్వులు, ఆరుకాయలుగా సంక్షేమం, అభివృద్ధి ప్రత్తిపాటి.

- ప్రతినెలా 1న పేదల కుటుంబాల్లో సంక్షేమ పండగ సంబరాలు : ప్రత్తిపాటి.
- రాష్ట్రంలో 80 శాతం కుటుంబాలకు ఏదో ఒక రూపంలో ప్రభుత్వ లబ్ధి.
- వర్గాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నారు ముస్తాక్ అహ్మద్.

చిలకలూరిపేట, సి కె న్యూస్ ప్రతినిధి చంద్రబాబు పాలనలో అమలవుతోన్న సంక్షేమం, అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, మూడు పువ్వులు, ఆరు కాయలు చందంగా అమలవుతున్న ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి మరే రాష్ట్రంలోనూ లేదని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

బుధవారం ఆయన రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్ తో కలిసి చిలకలూరిపేట పట్టణం లోని 11, 29 వార్డుల్లో 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇరువరు నాయకులు పేదల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రత్తిపాటి, ముస్తాక్ అహ్మద్ విలేకరులతో మాట్లాడారు. చివరిగా ప్రత్తిపాటి స్థానిక కూటమి నాయకులతో కలిసి యడ్లపాడు, నాదెండ్ల గ్రామాల్లో సామాజిక పింఛన్లు పంపిణీ చేసి, పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాదెండ్లలో సీసీరోడ్ల నిర్మాణం, ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో దాదాపు 1.40 కోట్ల రేషన్ కార్డులున్న కుటుంబాలుంటే.. 65 లక్షల పైచిలుకు కుటుంబాలకు సామాజిక పింఛన్లు అందుతున్నాయని, ఇతరులకు వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతోందని ప్రత్తిపాటి చెప్పారు. రాష్ట్రప్రజల్లో 80 శాతం మందికి ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, ఒక్క చిలకలూరిపేట పట్టణం లోనే ప్రతినెలా రూ.4.75 కోట్లను పింఛన్లు రూపంలో అందిస్తున్నామని ప్రత్తిపాటి తెలిపారు. చంద్రబాబు పాలన పేదలకు వరం..చంద్రబాబు పాలన నిజంగా పేదలకు వరమని, జగన్ అసమర్ధ పాలనతో ఐదేళ్లపాటు అభివృద్ధి, సంక్షేమానికి దూరమైన పేదలు, నేడు కూటమి ప్రభుత్వంలో సంతోషంగా జీవిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో ఏ రాష్ట్రానికి సాధ్యం కాని సంక్షేమాన్ని చంద్రబాబు ప్రజలకు అందిస్తున్నారన్నారు. ప్రతి వర్గం మేలు గురించి ఆలోచించే నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజల అదృష్టమని ప్రత్తిపాటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు, వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలతో ప్రజలకు అన్నిరకాల మౌలిక వసతుల కల్పనతో పాటు, పెట్టుబడుల సాధనలో రాష్ట్రాన్ని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలిపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వర్గాలు, పార్టీలు, ఓట్లకు అతీతంగా ప్రత్తిపాటి సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నారు ముస్తాక్ అహ్మద్. ప్రతినెలా 1 న రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో పండుగ వాతావరణం కనిపిస్తోందని, చంద్రబాబు నాయకత్వ సమర్ధతకు ఇది నిదర్శనమని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్ అభిప్రాయపడ్డారు. దేశంలో ఇంత భారీస్థాయిలో సామాజిక పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీయేనని, ఇది చంద్రబాబుకు తప్ప మరెవరికీ సాధ్యం కాని ప్రజా విజయమని అహ్మద్ తెలిపారు. పేదరికం లేని రాష్ట్రసాధన దిశగా అడుగులేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కు ప్రజలు ఎప్పుడూ అండగా నిలవాలన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఓట్లు, వర్గాలు, పార్టీలకు అతీతంగా ప్రత్తిపాటి, అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తున్నారని అహ్మద్ కొనియాడారు. ప్రత్తిపాటి పై ప్రజలకున్న అభిమానం, ఆత్మీయత వారి ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రజల సమస్యలపై ఆయన స్పందిస్తున్న తీరే అందుకు నిదర్శమని, ఓట్లు, పార్టీలతో తనకు పనిలేదని, నియోజకవర్గ అభివృద్ధే తనకు ముఖ్యమని ప్రత్తిపాటి బహిరంగంగానే చెబుతున్నారని అహ్మద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, జిల్లా ఉపాధ్యక్షులు బత్తినేని శ్రీనివాసరావు కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన కూరపాటి కిషోర్ దంపతులు.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగిలి వెంకన్న--సీత దంపతుల రెండవ కుమార్తె వివాహ వేడుకకు చింతకాని మాజీ జెడ్పీటీసీ, ఆత్మ కమిటీ డైరెక్టర్, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి తీరీష కిషోర్ దంపతులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

అనంతరం వధూవరుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం... గద్వాలలో ఆకస్మిక ఎన్.డీ.పీ.ఎస్. యూరిన్ టెస్టులు

- అనుమానితులకు ఎన్‌డీపీఎస్ యూరిన్ టెస్ట్ కిట్లతో పరీక్షలు
- ఒకరికి పాజిటివ్... చట్టపరమైన చర్యలకు సిద్ధం
- డ్రగ్స్‌పై నిరంతర ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయి: సీఐ టంగుటూరి శ్రీను



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఖూూ గారి ఆదేశాల మేరకు గద్వాల సీఐ శ్రీ టంగుటూరి శ్రీను గారి పర్యవేక్షణలో, గద్వాల పట్టణ ఎస్సై శ్రీ కళ్యాణ్ కుమార్ గారి ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు అనుమానితులకు గద్వాల పోలీస్ స్టేషన్‌లో ఎన్.డీ.పీ.ఎస్. యూరిన్ టెస్ట్ కిట్ల ద్వారా డ్రగ్స్ వినియోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

ఈ పరీక్షల్లో ఒక వ్యక్తికి పాజిటివ్ ఫలితం రావడంతో అతనిపై ఎన్.డీ.పీ.ఎస్. చట్టం ప్రకారం తగిన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు గద్వాల సీఐ శ్రీ టంగుటూరి శ్రీను తెలిపారు.

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ఇకపై కూడా పట్టణంలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మికంగా ఇలాంటి డ్రగ్స్ సంబంధిత తనిఖీలు, యూరిన్ టెస్టులు నిర్వహిస్తామని హెచ్చరించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఎంజేపీ బాలికల పాఠశాలను పరిశీలించిన అనగాని, సవిత



పెనుకొండ, సి కె న్యూస్ ప్రతినిధి : మండలం రాంపురం లోని ఎంజేపీ బాలికల పాఠశాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తో కలిసి రాష్ట్ర మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల లోని తరగతి గదులు, వసతి గృహం, భోజనశాల తదితర సౌకర్యాలను పరిశీలించిన మంత్రి సవిత విద్యార్థినులతో ఆప్యాయంగా మాట్లాడారు. పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలు, అవసరాల గురించి అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం అవసర మైన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. అలాగే విద్యార్థినులు క్రమశిక్షణతో బాగా చదువుకొని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి సవిత ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థిని తన లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం నూతన ఎంజేపీ పాఠశాల భవన నిర్మాణం కోసం 10 ఎకరాల స్థలాన్ని కేటాయించిన కూటమి ప్రభుత్వానికి, నారా లోకేష్ కి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ కి, స్థానిక మంత్రి సవిత కి విద్యార్థినులు కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వీరు పేర్కొన్నారు.




# ఇక్కడ మనమే వ్యవస్థను ఏర్పర్చుకోవాలి..

తనకు అవకాశాలు తగ్గిపోవడానికి ప్రధాన కారణం సినీ నేపథ్యం లేకపోవడమేనని యంగ్ హీరోయిన్ దివ్యభారతి ఆవేదన వ్యక్తం చేశారు. జీవీ ప్రకాష్ కుమార్ హీరో నటించిన 'బ్యాచిలర్ వంటి హిట్ చిత్రం తర్వాత కూడా తనకు అవకాశాలు తగ్గిపోవడానికి ప్రధాన కారణం సినీ నేపథ్యం లేకపోవడమేనని యంగ్ హీరోయిన్ దివ్యభారతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో.. 'జీవీ ప్రకాష్ నటించిన 25వ చిత్రం కింగ్‌స్టన్ మంచి చిత్రంగా ఉంటుందని ఊహించాం. కానీ, ఎక్కడో మా అంచనాలను తలకిందులు చేసింది. 'బ్యాచిలర్' మూవీ హిట్ తర్వాత నాకు సినిమా అవకాశాలు వస్తాయని ఎదురుచూశా కానీ, అందుకు విరుద్ధంగా జరిగింది. దీనికి కారణం సినీ నేపథ్యం లేకపోవడమే. ఒక చిత్ర విజయం తర్వాత ఆకాశాలు వస్తాయని గట్టినా నమ్మా. ఇది ఓవర్ కాన్ఫిడెన్స్ కాదు. ఇండస్ట్రీపై ఉన్న నమ్మకం. కానీ, అవకాశాల కోసం మనమే వ్యవస్థను ఏర్పరచుకుని, వెంపర్లాడాలని ఆ తర్వాతే అర్థమైంది' అని తన మనసులోని అవేదనను వ్యక్తం చేశారు. కాగా, తాజాగా ఆమె నటించిన 'ఏలంగు' వెబ్ సిరీస్ జియో హాట్ స్టార్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఇక తెలుగులో అరంగేట్రం చేస్తూ సుడిగాలి సుధీర్‌తో చేసిన గోట్ సినిమా ఇంతవరకు రిలీజ్‌కు నోచుకోక పోవడం గమనార్హం.

# వెబ్ సీరిస్, సినిమా ఒకదాని వెనుక ఒకటి!



ఐశ్వర్య రాజేశ్ నటించిన సూపర్ హిట్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం' గత యేడాది సంక్రాంతికి విడుదలై ఘన విజయం సాధించింది. ఆ తర్వాత ఆమె నటించిన తెలుగు స్ట్రయిట్ మూవీ ఏదీ ఇంతవరకూ రిలీజ్ కాలేదు. అయితే గత యేడాది నవంబర్ లోనే అర్జున్ తో కలిసి ఐశ్వర్య రాజేశ్ నటించిన తమిళ చిత్రం ఒకటి 'మఫ్టీ పోలీస్'పేరుతో తెలుగులో డబ్ అయ్యింది. కానీ ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు.

ఇప్పుడు మాత్రం ఐశ్వర్య రాజేశ్ నటించిన రెండు ప్రాజెక్ట్స్ తెలుగులో ఒక దాని వెనుక వస్తున్నాయి. సముతిరకనితో కలిసి ఐశ్వర్య రాజేశ్ నటించిన వెబ్ సీరిస్ 'ఇసాక పట్నం' ఈ నెల 2 నుండి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ కాబోతోంది. ఇందులో వీరిద్దరూ తండ్రీ కూతుళ్ళుగా నటిస్తున్నారు. అయితే తండ్రి ఆధిపత్యాన్ని ఎదురించే కూతురుగా ఐశ్వర్య రాజేశ్ కీలక పాత్ర పోషిస్తోంది. సునీల్, నరేశ్ అగస్త్య, మెరిన్ ఫిలిప్, సుధాకర్ కోమాకుల, రాజీవ్ కనకాల, మైమ్ గోపీ, రోహిణి, బెనర్జీ, రాజా చేంబోలు ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో రాహుల్ తమడా, సైదీప్ రెడ్డి బొర్రా దీనిని నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అయ్యే ఈ వెబ్ సీరిస్ ఏడు ఎపిసోడ్స్ ఉండబోతోంది.

ఇదిలా ఉంటే... జూలై 17న ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్ గా నటించిన 'ఓ సుకుమారి' మూవీ రిలీజ్ కానుంది. తిరువీర్ హీరోగా నటించిన ఈ సినిమాను భరత్ దర్శన్ దర్శకత్వంలో మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరో, హీరోయిన్ ఒకరినొకరు తాకబోతున్న క్షణాన్ని మెరుపులతో విజువల్‌గా చూపించిన తీరు సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి ఎం. ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం అందిస్తున్నారు. విశేషం ఏమంటే ఈ సినిమా కూడా పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇలా ఐశ్వర్య రాజేశ్ నటించిన ఓ వెబ్ సీరిస్, సినిమా బ్యాక్ టు బ్యాక్ వస్తుండటం విశేషమే!

# రాజమౌళి నరేషన్‌తో స్టన్నైన రణ కుంభ!

ఇప్పుడు భారతీయ సినిమా నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న అవైటెడ్ సినిమానే "వారణాసి". సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా ప్రియాంక చోప్రా హీరోయిన్ గా పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ గా దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ సినిమానే ఇది కాగా భారీ బడ్జెట్ తో గ్రాండ్ విజువల్స్ తో ప్లాన్ చేస్తున్నారు. అయితే ఈ సినిమాలో రణ కుంభగా కనిపించనున్న పృథ్వీ రాజ్ సుకుమారన్ జక్కన్నతో మొదటి నరేషన్ ఎక్స్ పీరియన్స్ అద్భుతం అని కొనియాడారు. రాజమౌళి కేవలం స్టోరీ చెప్పడమే కాదు ఫొటోలతో సహా వివరించి చెప్పడంతో తను సినిమా చూశానని ఆ రేంజ్ రాజమౌళి చెప్పిన విధానం అద్భుతం అని తెలిపారు.

దాదాపు మూడున్నర గంటల పాటు సాగిన ఆ నరేషన్ లో నాకు ఓ పక్క ఆ రూమ్ లో చల్లగా ఉంటే రాజమౌళి మాత్రం మొత్తం చెమటలు కక్కుతున్నారని కథని తను ఆ రేంజ్ లో ఎమోషన్ ని క్యారి చేస్తూ వివరిస్తున్నారు అన్నట్టు పృథ్వీరాజ్ చెప్పడం ఇపుడు వైరల్ గా మారింది.




# చిరు.. ఈ సారి టైమ్ ఇస్తారా?



మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర సినిమా ఏ ముహూర్తాన మొదలుపెట్టారో కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక ఇబ్బంది తలెత్తుతూనే ఉంది. ఈ సినిమా మొదలై దాదాపు మూడేళ్లు దాటిపోయింది. ఇంత కాలం గడిచినా, సినిమా రిలీజ్ డేట్‌పై ఇంకా సస్పెన్స్ వీడకపోవడం చర్చనీయాంశంగా మారింది. అసలు ఈ సినిమా రిలీజ్ అవుతుందో లేదో కూడా చెప్పలేని పరిస్థితికి వచ్చింది. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో మరింత నెగిటివ్‌గా మారుతున్నాయి.

విశ్వంభర సినిమా కోసం విజువల్ ఎఫెక్ట్స్ అత్యంత కీలకం. గతం లో వచ్చిన గ్లింప్స్‌పై కొన్ని భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో, యూవీ క్రియేషన్స్ అస్సలు రిస్క్ తీసుకోవద్దని నిర్ణయించుకున్నారు. క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదనే ఉద్దేశంతో, పోస్ట్ ప్రొడక్షన్ పనులను దాదాపు ఏడాదిన్నరగా పకడ్బందీగా చేస్తున్నారు. మెగాస్టార్ స్వయంగా 2026 సమ్మర్‌లో సినిమా విడుదలవుతుందని ప్రామిస్ చేసినా, సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యపడలేదు. గతేడాది మౌనీ రాయ్‌తో స్పెషల్ సాంగ్, కీలక సన్నివేశాలను పూర్తి చేసి షూటింగ్ ప్యాకప్ చెప్పినట్లు కూడా వార్తలు వచ్చాయి. కానీ, ఇప్పుడు మళ్ళీ కొత్త చర్చ మొదలైంది.

తాజా సమాచారం ప్రకారం, సినిమా అవుట్‌పుట్‌ను ఇంకా మెరుగుపరిచేందుకు కొన్ని సన్నివేశాలను రీ షూట్ చేయాలని మూవీ యూనిట్ భావిస్తోందట. ఒకవైపు బాబీ కొల్లి దర్శకత్వంలో రూపొందుతున్న మెగా 158 కోసం మెగాస్టార్ భారీ కసరత్తులు చేస్తున్నారు. ఈ చిత్రాన్ని సంక్రాంతి బరిలో దించేలా ప్లాన్ చేస్తున్నారు. ఇలాంటి బిజీ షెడ్యూల్స్ మధ్యలో, ఇప్పటికే పూర్తయిన విశ్వంభర కోసం మళ్ళీ డేట్స్ కేటాయించడం చిరంజీవి గారికి ఎంతవరకు సాధ్యం..? ఆ రీ-షూట్‌కి ఆయన ఎలా స్పందిస్తారు..? అనేదే ఇప్పుడు పెద్ద ప్రశ్న. ఈ ప్రాజెక్ట్ కోసం చిరంజీవి గారు పెడుతున్న కృషి, తీసుకుంటున్న శ్రద్ధ మాటల్లో చెప్పలేం.

విశ్వంభర బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధంగా ఉంది. అయితే, అభిమానులు మాత్రం ఈ సినిమా రిలీజ్ కోసం ఎంతో ఆత్రుతగా వేచి చూస్తున్నారు. ఈ ఏడాదైనా సినిమాకు సంబంధించిన పనులన్నీ కంప్లీట్ చేసి, ఫ్యాన్స్‌కు భారీ గిఫ్ట్ ఇస్తారా లేదా అనేది చూడాలి. చిరంజీవి గారు ఎప్పుడూ తన అభిమానులను నిరాశపరచరు కాబట్టి, ఈ సినిమా విషయంలో కూడా త్వరలోనే ఒక క్లారిటీ వస్తుందని ఆశిద్దాం.


## హాట్ స్టార్!




# 'ది ప్యారడైజ్' రిలీజ్ డేట్.. ఇక వచ్చేది అప్పుడేనా..?



భారీ అంచనాలతో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' చిత్రబృందం ప్రస్తుతం ఒక విచిత్రమైన రిలీజ్ డేట్ పజిల్‌ను ఎదుర్కొంటోంది. మార్చి నుంచి మొదలుపెట్టి, మొన్నటి ఆగస్ట్ 21 వరకు ఎప్పటికప్పుడు సరికొత్త డేట్లతో ప్రేక్షకులను ఊరించినప్పటికీ, ఏదీ వర్కవుట్ కాలేదు. పైగా మేకర్స్ వదిలేసిన ఆగస్ట్ డేట్‌ను రవితేజ 'ఇరుముడి' టీమ్ చకచకా లాగేసుకోవడంతో, ఇప్పుడు 'ప్యారడైజ్' టీమ్ సెప్టెంబర్ 25 వైపు లుక్కేసింది. కానీ, తాజా ఇన్సైడ్ టాక్ ప్రకారం ఆ తేదీకి కూడా సినిమా రావడం అనుమానమే అంటున్నారు సినీ విశ్లేషకులు.

ఈ డేట్ల మార్పుల వెనుక అసలు ట్విస్ట్ ఏంటంటే.. సినిమా ఇంకా గుమ్మడికాయ కొట్టడానికి సిద్ధంగా లేదట. కనీసం మరో రెండు నెలల పాటు నాన్‌స్టాప్‌గా షూటింగ్ చేయాల్సిన సీన్ ఇంకా బాకీ ఉంది. ఒకవేళ అక్టోబర్ నాటికి ఎలాగోలా గుమ్మడికాయ కొట్టి థియేటర్లలోకి వద్దామన్నా, అక్కడ 'రామాయణ' లాంటి పాన్-ఇండియా విజువల్ వండర్ కాచుకుని కూర్చుంది. ఆ సినిమాతో తలపడితే అటు బాలీవుడ్ బెల్ట్, ఇటు ఓవర్సీస్ మార్కెట్‌లో థియేటర్లు దొరకడం గగనమైపోతుంది. దీంతో నవంబర్ అనే డల్ సీజన్‌ను నమ్ముకోలేక మేకర్స్ తీవ్ర ఒత్తిడిలో పడ్డారు.



ఈ మొత్తం వ్యవహారంలో చిత్ర యూనిట్‌కు ఉన్న ఏకైక బెటర్ ఆప్షన్ డిసెంబర్ మాత్రమే. అయితే అక్కడ కూడా ప్రభాస్ 'ఫౌజీ', షారుఖ్ ఖాన్ 'కింగ్' వంటి భారీ ప్రాజెక్టులు పోటీగా నిలిచే ప్రమాదం ఉంది. పైగా ఇదొక ఊరమాస్ వయొలెంట్ యాక్షన్ డ్రామా కావడం వల్ల, ఫ్యామిలీ ఆడియన్స్ వచ్చే సంక్రాంతి పండగ సీజన్‌కు ఇది అస్సలు సూట్ అవ్వదు. గతంలో 'సలార్' కూడా ఇదే స్ట్రాటజీతో జనవరిని కాదని క్రిస్మస్ విండోలో వచ్చి ఎలాగైతే క్లీన్ స్వీప్ చేసిందో, ఇప్పుడు 'ప్యారడైజ్' కూడా అలాంటి ఒక సోలో డేట్ కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# మల్టీస్టారర్‌తో మాస్ రాజా ఎంట్రీ?

2027 సంక్రాంతి బాక్సాఫీస్ రేసులోకి మాస్ మహారాజా రవితేజ, శ్రీవిష్ణు క్రేజీ మల్టీస్టారర్ వచ్చి చేరింది. 'రాజ రాజ చోర', 'స్వాగ్' చిత్రాల దర్శకుడు హసిత్ గోలి తెరకెక్కిస్తున్న ఈ సినిమా అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుంది. కామెడీ టైమింగ్‌లో దిట్టలైన రవితేజ, శ్రీవిష్ణు కలిసి నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అప్పుడే అంచనాలు పెరిగాయి. ఈ చిత్రాన్ని స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

ఇప్పటికే 2027 పండగ బరిలో చిరంజీవి-బాబీ సినిమా, అనిల్ రావిపూడి మల్టీస్టారర్ మరియు 'కింగ్ 100' వంటి భారీ చిత్రాలు ఉన్నాయి. ఇప్పుడు రవితేజ-శ్రీవిష్ణు సినిమా కూడా తోడవ్వడంతో వచ్చే సంక్రాంతి బాక్సాఫీస్ వద్ద పండగ పోటీ అత్యంత రసవత్తరంగా మారనుంది.